నాసిరకం.. నాణ్యత లోపం

- ఊట్ల గిరిజన గ్రామంలో అధ్వానంగా మరుగుదొడ్ల నిర్మాణాలు
- వినియోగించుకోలేక వదిలేసిన గిరిజనులు

దండేపల్లి: గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని, దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతంలో గల ఊట్ల గిరిజన గ్రామంలో స్వచ్ఛభారత్ మిషన్‌పథకం ద్వారా నాలుగేళ్ల క్రితం నిర్మించిన మరుగుదొడ్లు నాసిరకంగా, నాణ్యత లోపంగా ఉన్నాయి. దీంతో వాటిని గిరిజనులు ఏ మాత్రం వినియోగించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపంతో, గుత్తేదారులు వాటి నిర్మాణాలు ఇష్టారాజ్యంగా చేపట్టి, ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రభుత్వం సంకల్పించిన స్వచ్ఛత ఇక్కడ కనుమరుగైంది. మళ్లీ ఎప్పటిలాగే ఇక్కడి గిరిజనులు బహిర్భూమికి బయటికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

ఇదీ పరిస్థితి..
దండేపల్లి మండల కేంద్రానికి సుమారు 8కిలో మీటర్ల దూరంలో గల దట్టమైన అటవీప్రాంతంలో ఊట్ల గిరిజన గ్రామం ఉంది. ఇదీ మామిడిపల్లి పంచాయతీ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ సుమారు 22కుటుంబాలు, 80కి పైగా జనాభా ఉంటుంది. అడవిలో లభించే వెదురు బద్దలతో తడుకలు అల్లుకుని గిరిజనులు తమ జీవనం సాగిస్తుంటారు. గ్రామాల్లో బహిరంగ మలవిసర్జనను నియంత్రించేందుకు ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛభారత్ మిషన్ పథకంలో భాగంగా, గ్రామానికి 18మరుగుదొడ్లు మంజూరు చేసింది.

నిర్మాణాలపై అవగాహన లేక..
బాహ్య ప్రపంచానికి దూరంగా, దట్టమైన అటవీ ప్రాంతంలో నివాసముండే గిరిజనులకు మరుగుదొడ్ల నిర్మాణం, వాటి వినియోగం గురించి పెద్దగా అవగాహన లేదు. పైగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ, వాటిని ఎలా నిర్మించుకోవాలో తెలియదు. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న, అప్పటి ప్రజాప్రతినిధులు, కొందరు గుత్తేదారులు కుమ్మక్కై, గిరిజనులకు మరుగుదొడ్లు నిర్మించి ఇచ్చారు.


నాణ్యత లోపంగా మరుగుదొడ్డి


అసంపూర్తిగా ఉన్న నిర్మాణం

నాణ్యత లేకుండా..
గ్రామంలో నిర్మించిన మరుగుదొడ్లు నాణ్యత లోపంగా, నాసిరకంగా నిర్మించారు. మరుగుదొడ్లు తక్కువ ఎత్తులో, పైగా ఇరుకుగా, ఇష్టారాజ్యంగా నిర్మించారు. దీంతో కనీసం వాటిని వినియోగించుకునే వీలుకూడా లేదు. కొన్నింటిని అసంపూర్తిగా వదిలేయగా, మరికొన్ని వినియోగించకుండానే కూలిపోవడంతో, వాటి నాణ్యత ప్రమాణాలు బహిర్గతమవుతున్నాయి. ఉన్నతాధికారులు ఊట్ల గిరిజన గ్రామాన్ని సందర్శించి, మరుగుదొడ్లను పరిశీలించి, వాటికి మరమ్మతు చేయడమో, లేదా అసంపూర్తిగా ఉన్నవాటిని పూర్తిచేసి, గిరిజనులు మరుగుదొడ్లు వినియోగించుకునేలా చేయాలని పలువురు కోరుతున్నారు.


కూలిపోయిన మరుగుదొడ్డి

బకెట్ పెట్టుకోరాదు..

మరుగుదొడ్డి అని కట్టిచ్చిండ్రు కానీ, అందులో కనీసం నీళ్ల బకెట్ కూడా పెట్టుకోరాదు. మనిషి నిలబడరాదు. అంతా మంచిగా కట్టలేదు. ఇష్టం అచ్చినట్లు, ఆగమాగం కట్టి ఇడిసిపెట్టిండ్రు. అవి వాడుకునే వీలు లేదు.

– నర్సవ్వ, గిరిజన మహిళ, ఊట్ల

పూర్తిగా కట్టలే..

మాకు మరుగుదొడ్డి సాంక్షన్ అయ్యిందన్నరు. ఇటుకలు, రేకులు ఇచ్చిండ్రు, కట్టుడు మాత్రం పూర్తి చేయలేదు. సగంలనే ఇడిసిపెట్టిండ్రు. మాకు మరుగుదొడ్డి లేదు. మాకు ఏమి తెలువదని, ఇష్టమచ్చినట్లు కట్టిండ్రు.

– జ్యోతి, గిరిజన మహిళ, ఊట్ల

అలరించిన కవి సమ్మేళనం

మంచిర్యాలఅర్బన్: స్థానిక సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం సంగీత సాహిత్య సుధా వాహిని సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సద్దుల బతుకమ్మ, దసరా పండుగను పురస్కరించుకొని నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవితాగానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శ్రీనాథ్‌గౌడ్, కవులు, రచయితలు మలయశ్రీ, గోపగాని రవీందర్, స్వరూపా పట్వర్ధన్, అల్లాడి శ్రీనివాస్, ఆనంద్‌రావు, రాజేశం గౌడ్, సుజాత, సునీత, రజిత, అక్షిత, సంతోష్, బ్రహ్మయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు


వ్యక్తిత్వ వికాస నిపుణులతో నిర్వాహకులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సింగాపూర్ ఆర్అండ్ఆర్ కాలనీలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఆదివారం వ్యక్తిత్వ వికాస సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణులు మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లు, మద్యపాన నిషేధం, ధూమపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీ పట్వర్ధన్, తెలుగు అధ్యాపకులు తాడోజి సత్యనారాయణ, యువకులు రవికిరణ్, చందు, సాయికిరణ్, మధు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గడపగడపకూ పీఎస్ఆర్


సమస్యలు తెలుసుకుంటున్న సురేఖ

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు పాత మంచిర్యాలలోని అంబేద్కర్ కాలనీలో గడపగడపకూ పీఎస్ఆర్ కార్యక్రమాన్ని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు సురేఖ గడపగడపకూ వెళ్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రేమ్‌సాగర్ రావు సేవ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తూముల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా బంగారి ప్రసాద్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యలపై పోరాటం సాగిస్తూ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు.

సీఎస్ఐ చర్చిలో వైద్య ఆరోగ్య శిబిరం


కంటి పరీక్షల కోసం క్యూకట్టిన క్రైస్తవులు

బెల్లంపల్లి: స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. రెవరెండ్ సీహెచ్ అశోక్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి క్రైస్తవుల నుంచి స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో హాజరై వైద్య, కంటి పరీక్షలు చేయించుకున్నారు. వ్యాధి నిర్ధారణ చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలను నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, క్రైస్తవులు పాల్గొన్నారు.

దాతలకు గుర్తింపు పత్రాల అందజేత


గుర్తింపు పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి తిలక్ వాకర్స్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అల్పాహారం దాతలకు గుర్తింపు పత్రాలు అందజేశారు. తిలక్‌స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పత్రాలను నిర్వాహకులు పంపిణీ చేశారు. నిరుపేదలు, దినసరి కూలీలు, భవన నిర్మాణ కార్మికుల కోసం చేపట్టిన అల్పాహారం కార్యక్రమం సంవత్సర కాలాన్ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అల్పాహారానికి సహకారం అందజేసిన దాతలకు తిలక్‌వాకర్స్ అసోసియేషన్ నిర్వాహకులు గుర్తింపు పత్రాలను అందజేసి ఎప్పటి మాదిరిగానే సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో తిలక్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు రత్నం రాజం, రంగ రామన్న, నాగేష్, గెల్లి జయరాం, శ్రీనివాస్, వెంకట్రాజం, రాజేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

దళితబంధుపై శ్వేతపత్రం విడుదల చేయండి


మాట్లాడుతున్న రాజారమేశ్

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఎంతమంది అర్హులకు దళితబంధు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు రాజా రమేశ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు షోలో దళితబంధు ఇవ్వాలని ప్రశ్నించిన దళిత సోదరులపై మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ నాయకులు దాడి చేయడం శోచనీయమన్నారు. నూతనంగా నిర్మించిన ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు, సదుపాయాలు లేనప్పటికీ ప్రజలను మోసం చేసేందుకు ప్రారంభించారని ఆరోపించారు. ఇకముందు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలపై దాడి చేస్తే ప్రతి దాడి చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెన్నూరి శ్రీధర్, పాతర్ల నాగరాజు, అన్వర్, లింగంపల్లి మహేశ్, భీమ్ మధు, కడవండి మహేశ్, గద్దం సుమంత్, తుంగపిండి అనిల్, ముదస్సిర్, సుల్తాన్, ప్రసాద్, బొడ్డు రాకేశ్‌లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి

- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లిరూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామంలో ఆదివారం రూ.29లక్షల నిధులతో నిర్మించే నూతన కల్వర్టు, రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చిన్నయ్య మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కేసీఆర్ పాలన సాగిస్తున్నారన్నారు. అనంతరం పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకుని వినతిపత్రాలు అందజేశారు. గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ నిర్మల, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పెద్దన్న, కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, నాయకులు గణేష్ గౌడ్, అశోక్ గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి
కాసిపేట: అన్నివర్గాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పూర్తి స్థాయిలో పనిచేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పర్యటించి అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. పెద్దనపల్లిలో రూ.10లక్షలతో సీసీరోడ్డు, మామిడిగూడెంలో రోడ్డు, సండ్రల్‌పహాడ్‌లో రూ.24లక్షలతో సీసీ రోడ్డు, ముత్యంపల్లిలో రూ.18లక్షలతో మహిళ సమాఖ్య భవనం, కోమటిచేనులో రూ.15లక్షలతో సీసీ రోడ్లు, పల్లంగూడ, తంగళ్లపల్లి, కోనూర్, లంబాడితండాలలో పలు అభివృద్ధి పనులు, తాటిగూడ నూతన గ్రామపంచాయతీ నిర్మాణానికి, మల్కేపల్లిలో రూ.18లక్షలతో ఐకేపీ భవనం, సీసీ రోడ్డు, మెటల్‌రోడ్డు నిర్మాణాలకు భూమిపూజ చేశారు. సోనాపూర్‌లో సీసీ రోడ్డు, వెంకటపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణాలకు, దేవాపూర్‌లో సీసీ రోడ్లు, రూ.39లక్షలతో మహిళ సమాఖ్య భవనం, రూ.18లక్షలతో మద్దిమాడలో మహిళ సమాఖ్య భవనం, కొండాపూర్ తదితర గ్రామాల్లో సీసీ రోడ్డు, మహిళసంఘం భవనాల నిర్మాణ పనులు ప్రారంభించారు. క్రీడాకారులకు ప్రభుత్వం అందించిన క్రీడాకిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మి, జెడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రంరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు దుర్గం పోశం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.


చిన్నయ్యకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

పల్లెచెంతకే మెరుగైన వైద్యం

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

దండేపల్లి: పల్లె ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు, పల్లెచెంతకే వైద్యం తేవాలనే ఉద్దేశంతో, సీఎం కేసీఆర్ రెండు, మూడు గ్రామాలకొక పల్లెదవాఖానను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్, కొర్విచెల్మ, రెబ్బనపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానలను ఆదివారం ప్రారంభించారు. పల్లెల్లో మెరుగైన వైద్యం అందించేందుకు, ప్రతి పల్లెదవాఖానకు డాక్టరు, ఏఎన్ఎంలను నియమించిందన్నారు. పల్లె ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


పల్లెదవాఖానను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కమ్యూనిటీ హాళ్ల ప్రారంభం
మంచిర్యాలటౌన్: పాత మంచిర్యాలలోని 8వ వార్డులో కొండ పోచమ్మ రోడ్డులో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆదివారం ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, పట్టణ కౌన్సిలర్ గాదే సత్యం, మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్, రైతు మండల కన్వీనర్ తూముల వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.
నస్పూర్: పట్టణ పరిధిలోని సీతారాంపల్లిలో కమ్యూనిటీహాల్ భవన నిర్మాణానికి, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. అనంతరం శ్రీరాంపూర్‌లో జేసీబీని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కౌన్సిలర్లు పూదరి కుమార్, రేగుంట చంద్రశేఖర్, మేకల దాసు, బండి పద్మ, సంధ్యారాణి, మున్సిపల్ కమిషనర్ రమేష్, నాయకులు రఫీక్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.
లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెం రోడ్‌లో క్రిష్టియన్ మైనార్టీ కమ్యూనిటీ హాల్‌కు ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు చాతరాజు రాజన్న, సురేష్ నాయకులు రాజన్న, తిరుపతి, కిషన్, క్రిష్టియన్లు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన వారికి ప్రోత్సాహకం

మంచిర్యాలటౌన్: సేవా భారతి, రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు ఉచితంగా కోచింగ్ పొంది కానిస్టేబుల్ ఉద్యోగానికి నలుగురు మహిళలు వేముల విష్ణుప్రియ గ్రామం బెజ్జాల, జనగామ మల్లేశ్వరి ఎర్రగుంటపల్లె గ్రామం, కావేరి లక్ష్మీ నాగంపేట గ్రామం, మందపల్లి అశ్విత మంచిర్యాల అనే అభ్యర్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ నలుగురు అభ్యర్థులను వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నలుగురు అభ్యర్థులు పేద కుటుంబం నుంచి వచ్చిన మహిళలు, వారికి ఉచిత శిక్షణ, ఉచిత భోజనం, ఉచిత వసతి ఇచ్చి వారికి కావాల్సిన మెటీరియల్స్, శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో శిక్షణ తీసుకొని ఒకరు సివిల్ కానిస్టేబుల్‌గా, ముగ్గురు ఏఆర్ కానిస్టేబుల్స్‌గా ఎంపికయ్యారన్నారు. వారు ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆ కాంక్షించారు. యువతీ, యువకులకు మా ఫౌండేషన్ ఎల్లప్పుడు ఉద్యోగ అవకాశాలు కల్పించేందు కు కృషి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఫిట్‌నెస్ ట్రైనర్ ప్రభాకర్, బీజేపీ మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు.


ప్రోత్సాహకాలు అందజేస్తున్న రఘునాథ్

‘ఎమ్మెల్యే అసమర్థతతో వెనుకబాటు’

మంచిర్యాలటౌన్: ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అసమర్థత పాలన వల్లనే నియోజకవర్గం వెనకబడిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. మంచిర్యాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సిరిపురం రాజేష్, మాజీ కౌన్సిలర్ పూదరి ప్రభాకర్, అశోక్ తేజ మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపించడంతో ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు హడావిడిగా చేస్తున్నారని విమర్శించారు. మంచిర్యాల టూటౌన్ అభివృద్ధి చెందిందని, ఆ ప్రాంత బీఆర్ఎస్ కౌన్సిలర్ అబద్ధాలు ఆడటం తగదన్నారు. ఎక్కడ అభివృద్ధి జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. మున్సిపల్ ప్రతిపక్ష నాయకులు ఉప్పలయ్య, ఉప నాయకులు వేములపల్లి సంజీవ్, మజీద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుపతి, పట్టణ అధ్యక్షులు నరేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


‘తునికాకు బోనస్ చెల్లించలే?’


మాట్లాడుతున్న ఆదివాసీ మహిళా కూలీలు

భీమారం: ఆరేళ్ల క్రితం తునికాకు సేకరణ చేసిన బోనస్ డబ్బులను ఇంతవరకు చెల్లించలేదని భీమారం మండలం ధర్మారం గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళలు ఆరోపించారు. ఆదివారం ‘సాక్షి’తో మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం తునికాకు సేకరణ చేస్తున్నా, 2018నుంచి బోనస్ చెల్లించడం లేదని పేర్కొన్నారు. ఈ విషయమై అధికారులను అడిగినా సమాధానం చెప్పడం లేదని అంటున్నారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించినా అటవీశాఖ అధికారులు చెల్లించడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి బోనస్ చెల్లించేలా చూడాలని కోరారు.

దేశవ్యాప్తంగా బీసీ జనగణన చేపట్టాలి

పాతమంచిర్యాల: రాబోయే జనాభా లెక్కల్లో దేశవ్యాప్తంగా బీసీ జనగణన చేపట్టాలని బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బీహార్ బీసీ జనగణన విజయోత్సవ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భారతదేశ చరిత్రలో తొలిసారిగా బీహార్ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ బీసీ జనగణన చేపట్టి ఆదర్శంగా నిలిచారన్నారు. 2021జనాభా లెక్కల్లో బీసీ జనగణన చేపడతామని హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్రమోదీ అగ్రవర్ణాల ఒత్తిళ్లకు తలొగ్గి బీసీ జనగణన చేపట్టకుండా బీసీలకు అన్యాయం చేశారన్నారు. పార్లమెంట్‌లో ఇచ్చిన హామీ ప్రకారం బీసీ జనగణన చేపడతామని మోదీ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక కన్వీనర్ ఒడ్డేపల్లి మనోహర్, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, నాయకులు మల్లయ్య, సమ్మ రాజన్న, మాడిశెట్టి విశ్వం, బుద్దే చంద్రమౌళి, పాయిరాల రాములు, రవూఫ్, చరణ్‌కుమార్, ముత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

బీజేపీ నాయకుల శ్రమదానం

రామకృష్ణాపూర్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం బీజేపీ నాయకులు శ్రమదానం చేపట్టారు. పాఠశాల ఆవరణలో ఏపుగా మొలచిన పిచ్చిమొక్కలను తొలగించారు. పాఠశాలలో పిచ్చిమొక్కల కారణంగా విషసర్పాలు ఎక్కువగా వస్తుండటంతో తమవంతు బాధ్యతగా తొలగించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్, అక్కల రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.



పడిపోకముందే.. పట్టించుకోండి

దండేపల్లి: మండలంలోని చింతపల్లిలో వాటర్ ట్యాంకు నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం వంగి ప్రమాదకరంగా ఉంది. దండేపల్లిలో డీ–28 కెనాల్ గుండా కస్తుర్బా పాఠశాలకు వెళ్లే రోడ్డులో విద్యుత్ స్తంభం వంగింది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.


చింతపల్లి ఎస్సీకాలనీ దారిలో ఒరిగిన స్తంభం

యువత లక్ష్యంతో ముందుకెళ్లాలి

దండేపల్లి: యువత లక్ష్యంతో ముందుకు వెళ్లినప్పుడు, అనుకున్నది సాధించవచ్చని, ఎస్సై కుందారపు ప్రసాద్ అన్నారు. దండేపల్లి మండలం నుంచి పోలీస్, ఆర్మీ ఉద్యోగాలు సాధించిన మడిపెల్లి వెంకటేష్, ఆయిల్ల అనిల్, కట్కూరి లక్ష్మణ్, కొదురుపాక రాహుల్‌ను రజక సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం దండేపల్లిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ఉద్యోగాలు సాధించిన యువకులను అభినంధించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కట్కూరి రాజన్న, మండల అధ్యక్షుడు పుట్టపాక తిరుపతి, ఎంపీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు త్రిమూర్తి, వెంగల్‌రావ్, సంఘ నాయకులు పాల్గొన్నారు.


దండేపల్లిలో సన్మానిస్తున్న నాయకులు

కన్నెపల్లిలో పోలీస్, ఆర్మీ ఉద్యోగాలు సాధించిన సాహిత్‌వర్మ, వెంకటేష్, అనిల్‌కుమార్, అరుణ్‌కుమార్, గణేష్, శ్రీవిద్య లను న్యాయవాది చుంచు సదానందం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బాలగోపాల్ వర్ధంతి
కాసిపేట: స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మానవ హక్కుల నేత బాలగోపాల్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బియ్యం, నగదు అందజేత
చెన్నూర్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన దళిత నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దశదిన కర్మకు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మధురాజ్ మృతురాలు కుటుంబ సభ్యులు రాజన్నకు 50కిలోల బియ్యం, రూ.2వేల నగదు అందజేశారు.

‘ఓపెన్’ ప్రవేశాలకు 13వ తేదీ ఆఖరు
దండేపల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 13వరకు, అపరాధ రుసుంతో అవకాశం ఉందని దండేపల్లి ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ బిసగోని శంకర్ గౌడ్, సహాయ కోఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విజయవంతం చేయండి
మందమర్రిరూరల్: నేడు హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరాం వర్ధంతి నిర్వహించనున్నట్లు కార్యక్రమానికి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంపత్‌కుమార్ పిలుపునిచ్చారు.

సన్మానం
పాతమంచిర్యాల: పోలీస్ ఉద్యోగం సాధించిన పట్టణానికి చెందిన మందపల్లి అశ్వినిని తెలంగాణ బీసీ జాగృతి నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలో సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్, తెలంగాణ బీసీ జాగృతి నాయకులు పాల్గొన్నారు.

చేపల పంపిణీ
లక్సెట్టిపేట: మండలంలోని ఎల్లారం చెరువులో సర్పంచ్ పింగిళి శ్రీలత ఆధ్వర్యంలో చేప పిల్లలను చెరువులో వదిలారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన చేప పిల్లలను చెరువులో వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్తవ్వ, గ్రామస్తులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ
మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గిరిజన గ్రామాలైన గఢ్‌పూర్, ర్యాలీ, నాగారం, చిన్నగోపాల్‌పూర్ గామాల్లోని మహిళలకు సర్పంచులు లక్ష్మి, రాజు, సోనేరావు, భీంబాయి ఆదివారం బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఎంపీపీ కో ఆప్షన్ రఫీక్, ఉప సర్పంచ్‌లు వెంకటేష్, బానయ్య, మాణిక్‌రావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.